క్లుప్తంగా

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బాధితురాలికి నగదు అందజేస్తున్న కార్యదర్శి, తదితరులు

రాజాం సిటీ: మండల పరిధి పొగిరి గ్రామానికి చెందిన జడ్డు వెంకటలక్ష్మికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద బుధవారం రూ. పది వేలు అందజేశారు. బాధితురాలి భర్త మంగన్న గత నెల 30న మృతి చెందడంతో తక్షణ సాయంగా మంజూరైన నగదును పంచాయతీ కార్యదర్శి పి. వెంకటరమణ బాధితురాలికి అందించారు. కార్యక్రమంలో సచివాలయం-2 వెల్ఫేర్ కార్యదర్శి భారతి, మోహన్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సేవాభావం గొప్పది..

● ఎంఈఓ దుర్గారావు



విద్యార్థులకు వాటర్ గ్లాసులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ దుర్గారావు

వంగర: సమాజంలో సేవాభావం గొప్పదని ఎంఈఓ వై.దుర్గారావు తెలిపారు. మండల పరిధి నీలయ్యవలస ప్రాథమిక పాఠశాలలో చీపురుపల్లికి చెందిన బాబూజీ సంస్థల అధినేత వద్దాది కిశోర్‌కుమార్ సమకూర్చిన రూ.7 వేల విలువ చేసే స్టీల్ వాటర్ బాటిళ్లను ఎంఈఓ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, స్టీల్ బాటిళ్ల పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చేబోలు జయరాజ్, ఉపాధ్యాయురాలు వాసంతి, పీఎంసీ చైర్మన్ టి.శంకరరావు, సివిల్ సప్లయ్ డీలర్ పి.గౌరీశంకర్, పంచాయతీ కార్యదర్శి సింహాచలం, ఆరోగ్య సిబ్బంది సరస్వతి, యామిని, ఝాన్సీ, వలంటీర్లు సాయి, నవీన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు ఆర్‌బీకే ప్రారంభోత్సవం

తెర్లాం: మండలంలోని ఎం.ఆర్.అగ్రహారం సచివాలయంలో రైతు భరోసా కేంద్రాన్ని గురువారం ప్రారంభించనున్నట్టు పీఆర్ జేఈ ఆర్నేపల్లి రాజశేఖరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌బీకే ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు హాజరు కానున్నారని తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు రాజాంలో సామాజిక సాధికార బస్సుయాత్ర

● ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



ప్రధాన రహదారిలో ఏర్పాటైన ఫ్లెక్సీలు

రాజాం: పట్టణంలో వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సుయాత్ర గురువారం నిర్వహించనుంది. ఈమేరకు నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజికవర్గాలకు అటు పదవుల్లోను, ఇటు సంక్షేమంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున సామాజిక సాధికార బస్సుయాత్రలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో రెండో విడతలో భాగంగా రాజాంలో జరుగుతున్న యాత్రకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు.

బొద్దాం నుంచి ప్రారంభం

బస్సు యాత్ర నేపథ్యంలో రాజాంలోని పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కంబాల జోగులు వివిధ శాఖల అధికారులతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పలు ప్రాంతాల నుంచి మంత్రులు, పార్టీ రాష్ట్రస్థాయి నాయకులతో పాటు రాజాం నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వేలాదిమంది ప్రజలు యాత్రకు హాజరవుతారన్నారు. ఉదయం 10 గంటలకు బొద్దాం గ్రామం వద్ద స్వాగత కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 11 గంటలకు అదే గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేయడం.. 11.30 గంటలకు కొత్తగా నిర్మించిన సచివాలయ భవన సందర్శన ఉంటుందన్నారు. 12 గంటలకు అక్కడే పత్రికా సమావేశం నిర్వహిస్తారని, అనంతరం కార్యకర్తలతో బైక్ ర్యాలీగా రాజాంలో తృప్తి రిసార్ట్‌కు చేరుకుంటారని వివరించారు. అక్కడ మధ్యాహ్న భోజన విరామం.. తటస్థులతో సమావేశమవుతారన్నారు. అనంతరం యాత్ర ద్వారా రాజాం పట్టణంలోకి ప్రవేశిస్తారని వెల్లడించారు. 3 గంటలకు అంబేడ్కర్ జంక్షన్ వద్ద జేజే ఇనోటెల్ ఎదురుగా ప్రధాన రహదారిపై బహిరంగసభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి హాజరైన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ప్రధానంగా రాజాం ప్రధాన రహదారిలో ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని.. అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. శాంతిభద్రతలకు ఎటువంటి భంగం కలగకుండా ఉండేందుకు పోలీసులు ట్రాఫిక్ రూల్స్ అమలుచేయాలని, ఆర్టీసీ సేవలకు అంతరాయం ఉండకుండా వన్‌వే రూట్‌లు, బైపాస్ రోడ్డుల సేవలు వినియోగించాలని ఆర్‌అండ్‌బీ, పోలీసుశాఖ అధికారులను కోరారు.

భారీగా ఫ్లెక్సీలు..

ఇదిలా ఉండగా రాజాంలో అంబేడ్కర్ జంక్షన్ నుంచి పాలకొండ రోడ్డులో భారీ కటౌట్‌లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. బస్సుయాత్రకు సంబంధించి పెద్ద ఎత్తున స్టేజ్ ఏర్పాటు చేశబూరు. రాజాం ప్రధాన రహదారితో పాటు బొద్దాం, తృప్తి రిసార్ట్, తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున కటౌట్‌లు, జెండాలు ఏర్పాటు చేశారు.

సజావుగా సామాజిక తనిఖీ ప్రజావేదిక



ఉపాధి సామాజిక తనిఖీ ప్రజావేదికలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న అధికారులు

తెర్లాం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో 2022 – 23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులకు సంబంధించి ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో బుధవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. కార్యక్రమానికి ఉపాధి హామీ పథకం ఏపీడీ శారద, అంబుడ్స్‌మన్ అన్నపూర్ణమ్మ, సామాజిక తనిఖీ స్టేట్ రీసోర్స్‌పర్సన్ ఎస్.అచ్యుతరావు తదితరులు హాజరై సామాజిక తనిఖీలో పంచాయతీల వారీగా చేపట్టిన అంశాలపై సమీక్షించారు. 2022 – 23 ఆర్థిక సంవత్సరంలో రూ.16.79కోట్లతో 1168 పనులు చేయగా, ఈ పనులకు సంబంధించి పంచాయతీల వారీగా నిర్వహించిన సామాజిక తనిఖీలో ఎక్కువగా మస్తర్లలో వేతనదారుల వేలిముద్రలు లేకపోవడం, మస్తర్లలో దిద్దుబాటు, గణాంకాల్లో తేడాలు ఎక్కువగా కనిపించాయి. మరికొన్ని పంచాయతీల్లో ఉద్యానవన మొక్కల పెంపకానికి సంబంధించి మొక్కలు చనిపోవడాన్ని సామాజిక తనిఖీ బృందం గుర్తించారు. వీటికి సంబంధించి క్షేత్ర, సాంకేతిక సహాయకులను ప్రజావేదికకు హాజరైన ఏపీడీ వివరణ అడిగి తెలుసుకున్నారు. నందబలగ గ్రామంలో నిర్వహించిన సామాజిక తనిఖీలో ఆరు నెలల క్రితం ఉపాధ్యాయునిగా ఉద్యోగం పొందిన పి.రామారావు అనే వ్యక్తి వైఎస్సార్ పింఛన్ కానుకలో దివ్యాంగ పెన్షన్ తీసుకుంటున్నట్లు గుర్తించినట్లు డీఆర్‌పీ ప్రజావేదికలో తెలియజేశారు. దీనిపై నందబలగ పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీఓ కార్యాలయ జూనియర్ సహాయకులు సమాధానమిస్తూ ఉపాధ్యాయునిగా నియమితులైనా ఇంతవరకు సీఎఫ్‌ఎంఎస్ ఐటీ నంబరు రాలేదని, దీంతో గతంలో ఆయనకు మంజూరైన దివ్యాంగ పింఛన్ డబ్బులు తీసుకుంటున్నాడని, వచ్చే నెల నుంచి పింఛన్ నిలిపివేస్తామని వివరణ ఇచ్చారు. వెలుగు ఏపీ, మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ నీలిమ, ఏపీఓలు సుశీల, జగదీశ్వరరావు, పీఆర్ ఏఈ రాజశేఖరరావు, సాంకేతిక సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా సీఎం సహాయనిధి



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ఆపదలోఉన్న కుటుంబాలకు ఆర్థికంగా ఆదుకునే ముఖ్యమంత్రి సహాయ నిధిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాడంగి మండలం గజరాయునివలసకు చెందిన పూడి చిన్నంనాయుడు అనారోగ్య కారణంతో సీఎం సహాయ నిధిని ఇప్పించాలని కోరుతూ ఎమ్మెల్యే శంబంగి ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. దీంతో సీఎంఓ కార్యాలయం నుంచి అతనికి రూ.లక్షా 60వేలు మంజూరైంది. దీనికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు లబ్ధిదారునకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో బాడంగి మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొమ్మినాయుని వెంకటనాయుడు, జేసీఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు, ఎంపీపీ ప్రతినిధి తెంటు మధుసూదనరావు, జడ్పీటీసీ పెద్దింటి రామారావు, మూడడ్ల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓలు, హెచ్‌ఎంలకు శిక్షణ



అభ్యసనాభివృద్ధి కార్యక్రమంపై సూచనలిస్తున్న డిప్యూటీ ఈఓ బ్రహ్మాజీరావు

రామభద్రపురం: బోధనతో పాటు అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపట్టిందని ఉప విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు అన్నారు. స్థానిక పాఠశాలలో నిర్వహిస్తున్న అభ్యసనాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా బొబ్బిలి డివిజన్‌లోని ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఎంఈఓలకు ఇస్తున్న శిక్షణను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6, 7, 8 తరగతుల విద్యార్థులకు చదవడం, రాయడంలో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయుల తీసుకుంటున్న ప్రత్యేక సాధన పీరియడ్స్‌ను సమర్థవంతంగా నిర్వహించేలా హెచ్‌ఎంలు, ఎంఈఓలు పర్యవేక్షించాలన్నారు. అనంతరం స్థానిక పాఠశాలలో రికార్డులు పరిశీలించారు. హెచ్‌ఎం కె.కామేశ్వరరావు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఎంఈఓ తిరుమలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా భవనాలు

రాజాం సిటీ: మండల పరిధి బొద్దాం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే భవనాలు ప్రారంభానికి సిద్ధమయ్యాయని ఎంపీడీఓ బాసూరి శంకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 43.60 లక్షలతో సచివాలయ భవనం.. రూ. 23 లక్షలతో ఆర్‌బీకే భవనాలను నిర్మించినట్లు పేర్కొన్నారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర మంత్రుల చేతులమీదుగా వీటిని గురువారం ప్రారంభించనున్నట్లు తెలిపారు.

వినతి...



సబ్ ట్రెజరర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏపీ పెన్షనర్ల సంఘ ప్రతినిధులు

రాజాం: ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు విడుదల చేయాలని కోరుతూ పలువురు పెన్షనర్లు కోరారు. ఈ మేరకు సబ్ ట్రెజరీ ఆఫీసర్ వి.జోగారావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ రాజాం శాఖ అధ్యక్ష, కార్యదర్శులు నారాయణశెట్టి గౌరీశంకర్, డోల అప్పలనాయుడు, కొల్లి రామారావు, తదితరులు మాట్లాడుతూ, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రావాల్సిన నిధులు విడుదల చేయాలని కోరుతూ వినతిపత్రం అందించామన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ సభ్యులకు సన్మానం

వంగర: సంగమేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులను బుధవారం ఘనంగా సన్మానించారు. దేవదాయశాఖ కమిషనర్ నియమించిన ఎనిమిది మంది కమిటీ సభ్యులను సర్పంచ్ గేదెల వెంకటనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు గేదెల రామకృష్ణ ఆధ్వర్యంలో సత్కరించారు. అనంతరం సంగమేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉగిరి ముత్యాలు, బొడ్రోతు కృష్ణ, ముడిల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

20న వాహన వేలం

రాజాం సిటీ: పట్టణంలోని ఎస్ఈబీ కార్యాలయంలో ఈ నెల 20 ద్విచక్ర వాహనాన్ని వేలం వేయనున్నట్లు ఎస్ఈబీ సీఐ బి.శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ కేసులో సీజ్ చేసిన హోండా యాక్టివాను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేలం వేస్తున్నామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు నేరుగా పాటలో పాల్గొనాలని కోరారు.

సచివాలయాలతో ప్రజల ముంగిటకే పాలన



కోడూరు-2 సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: సచివాలయ వ్యవస్థతో ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలన చేరువైందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని బాడంగి 2 (పిన్నవలసలో), కోడూరు 2లో రూ.87లక్షల 20 వేల ఉపాధి నిధులతో నిర్మించిన సచివాలయ నూతన భవనాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా వినూత్న పద్ధతిలో గ్రామ స్వరాజ్యాన్ని ప్రజలకు అందిస్తున్న ఘతన జగనన్న ప్రభుత్వానికే దక్కిందన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతీ ఒక్కరికీ అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో శంబంగి వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, మండల పార్టీ అధ్యక్షుడు బి.వెంకటనాయుడు, వైస్ ఎంపీపీలు సింగిరెడ్డి భాస్కరరావు, బి.రమేష్, సర్పంచ్‌లు బోగి జ్యోతి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బొబ్బిలిలో..

బొబ్బిలి: ప్రభుత్వ కార్యాలయాల భవనాల నిర్మాణంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందుంజలో ఉంటుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని ఎం బూర్జివలస, కాశిందొరవలస గ్రామాల్లో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ల భవనాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన సేవలందించాలనే ఉద్దేశంతో సచివాలయ సముదాయాల్లోనే వెల్‌నెస్ సెంటర్లను నిర్మిస్తోందన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాలనాయుడు, జడ్పీటీసీ సంకిలి శాంతకుమారి, సర్పంచ్ జాగరపు శ్రీనివాసరావు, ఎంపీటీసీలు గుణుపూరు దేవి, గొర్లె తిరుపతి, వైఎస్సార్ సీపీ నాయకులు యడ్ల అప్పారావు, శ్రీనివాసరావు, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో జ్ఞానం



రేగిడి: గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన

రాజాం: పుస్తక పఠనంతో జ్ఞానం సిద్ధిస్తుందని ఎంఈఓ యాగాటి దుర్గారావు అన్నారు. బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పుస్తక జ్ఞానంపై పాఠకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వై.అమర్నాథ్, అసిస్టెంట్ రమణమ్మ, బీడీసీ అధికారి జగదీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రేగిడిలో..

రేగిడి: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి టి.ఈశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు అందించారు.

బస్సు యాత్రను విజయవంతం చేయండి..



మాట్లాడుతున్న నవరత్నాల వైస్ ఛైర్మన్ నారాయణమూర్తి

రాజాం: నియోజకవర్గ కేంద్రంలో గురువారం జరగనున్న సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని నవరత్నాల ఎగ్జిక్యూటివ్ స్టేట్ వైస్‌చైర్మన్ అంకంరెడ్డి నాగ నారాయణమూర్తి కోరారు. బుధవారం స్థానిక వేంకటేశ్వర కల్యాణ మంటపం వద్ద పలు వార్డులకు చెందిన ప్రజలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజాంలో జరిగే పార్టీ కార్యక్రమాలకు రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. శాసనమండలి విప్ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ, ఉదయం 10 గంటలకే ఈ యాత్ర ప్రారంభం అవుతుందని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ కంబాల సందీప్, వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, పొట్నూరు లక్ష్మణరావు, లావేటి రాజగోపాలనాయుడు, పట్టణానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు నాయకులు పాల్గొన్నారు.

నాణ్యత లోపిస్తే చర్యలు

● ఎంపీపీ సురేష్‌ముఖర్జీ



వంటకాలు పరిశీలిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

వంగర: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ హెచ్చరించారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం అమలు తీరును ఆకస్మికంగా పరిశీలించారు. వంటశాల ఆవరణ అపరిశుభ్రంగా ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు సరిపడా భోజనాలు లేకపోవడంపై నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకుముందు ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హనుమంతు శశిభూషణరావు, ఏఓ లోపింటి త్రినాథ్, హెచ్‌ఎం సత్తిబాబు, మహిళా పోలీస్ చింతలూరు లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై అవగాహన కల్పించండి



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఏపీఓ హరనాథరావు

రేగిడి: మండల రైతాంగానికి పండ్ల తోటల పెంపకం, వాటి వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని ఏపీఓ ఎస్.హరనాథరావు సూచించారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఉపాధి పనుల గుర్తింపుపై ఫీల్డ్‌అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు మొక్కలు ఉచితంగా అందిస్తామని, మూడేళ్ల వరకు పెంపకానికి సంబంధించిన ఎన్ఆర్ఈజీఎస్ నిధులు అందిస్తామన్నారు. ఈ విషయాన్ని రైతులకు వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఈసీ రామినాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్లతో పాటు సీనియర్ మేట్‌లు, రైతులు పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములనాయుడు ప్రాజెక్టు వద్ద వంగర పోలీసులు బుధవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కార్తీకమాసం ప్రారంభం కావడంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు ప్రాజెక్ట్‌ను సందర్శిస్తుంటారు. గతంలో ప్రాజెక్ట్ ఆవరణలో సరదా కోసం ఈతకు దిగి పలువురు ప్రాణాలు కోల్పోయారు. దీంతో పోలీసులు అప్రమత్తమై హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్సై ఆర్.జనార్దనరావు, హెచ్‌సీ వావిలపల్లి రామకృష్ణ, కానిస్టేబుల్ హేమసుందరరావు పాల్గొన్నారు.

నదీతీరంలో...

రేగిడి: కార్తీకమాసం సందర్భంగా మండలంలోని సంకిలి గ్రామం వద్ద నాగావళి నదీతీరంలో హెచ్చరిక బోర్డులు ఎస్సై ఇ. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, కార్తీకస్నానాలు ఆచరించే భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నేడు ట్రాఫిక్ మళ్లింపు

రాజాం సిటీ: రాజాంలో గురువారం జరగనున్న సామాజిక సాధికార బస్సుయాత్ర సందర్భంగా ట్రాఫిక్ మళ్లిస్తున్నామని రాజాం టౌన్ సీఐ కె.రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజాం నుంచి పాలకొండ వైపు వెళ్లే బస్సులకు కంచరాం టిడ్కో కాలనీ రహదారి నుంచి కంచరాం మీదుగా రాజాం చేరుకోవాలని సూచించారు. అలాగే పాలకొండ నుంచి రాజాం వెళ్లే బస్సులు కూడా అదే మార్గంలో రావాల్సి ఉంటుందన్నారు. రాయిఘడ నుంచి వస్తున్న లారీలు పాలకొండ, ఆమదాలవలస, చిలకపాలెం నుంచి రాజాం మీదుగా రామభద్రాపురం వైపు.. అలాగే రామభద్రాపురం నుంచి వచ్చిన లారీలు యథావిధిగా రాజాం మీదుగా చిలకపాలెం, ఆమదాలవలస, పాలకొండ మీదుగా రాయిఘడకు వెళ్లేలా ఏర్పాట్లు చేశామన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి టౌన్‌లోకి వచ్చి పోయే కార్లు, ఆటోలు బుచ్చెంపేట నుంచి కొండంపేట చెరువు గట్టు మీదుగా రాజాం చేరుకోవాలని తెలిపారు. ఈ విషయాన్ని వాహనదారులు గమనించాలని కోరారు.

● ఆంధ్రాకు జగనే మళ్లీ సీఎం కావాలి..



గంగన్నపాడులో వైఎస్సార్ సీపీ పార్టీ జెండాను ఎగరవేస్తున్న మండల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు -తెర్లాం

వేగవంతంగా టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు

బొబ్బిలి: పట్టణ సమీపంలో నిర్మిస్తున్న టిడ్కో గృహాల చివరి పనులను త్వరగా ముగించి ఇళ్లను అప్పగించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన టిడ్కో ఇళ్లను పరిశీలించారు. ఈ గృహ సముదాయాలను డిసెంబర్ నెలాఖరుకు అందించాల్సి ఉన్నందున పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

రేగిడి:వావిలవలసలో సామాజిక కార్యకర్త పాలూరి సిద్ధార్థ సుమారు 50 మంది పేదలకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. బెంగళూరుకు చెందిన ప్రసాద్ ఆర్థిక సహకారంతో కార్యక్రమం చేపట్టినట్లు సిద్ధార్థ తెలిపారు.